## ఏప్రిల్ 7 నుంచి 10 వరకు క్రీడా పోటీలు

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, ఉద్యోగులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు ఏప్రిల్ 7 నుంచి 10 వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ అదనపు కమిషనర్ యాదగిరి రావు తెలిపారు.150 మంది కార్పొరేటర్లు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ ఉద్యోగులు, సిబ్బందికి మహిళ, పురుషుల కేటగిరీల వారీగా వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు విక్టరీ ప్లే గ్రౌండ్, ఉప్పల్ స్టేడియంలో ఆయా తేదీల్లో ఉదయం, సాయంత్రం సెషన్లలో జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడలపై ఆసక్తి కలవారు పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

## ప్రజావాణికి 68 ఫిర్యాదులు

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు అడిషనల్ సీసీపీలు గంగాధర్ ప్రదీప్‌లు పాల్గొని నగరం నలుమూలల్లోని ప్రజలనుంచి వచ్చిన విన్నపాలు స్వీకరించారు. ప్రజావాణిలో 68 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, వాటర్ వర్క్స్ జీఎం సాయి రమణ, డిప్యూటీ సీఈ ప్రసనరెడ్డి హౌసింగ్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, ఈఈ రాజేశ్వర్ రావు, పీవీ రమణ రావు, ఎస్ఎన్ డీపీఈ ఈ వెంకటేశ్వరరావు, ఓఎస్డీ అనురాధ, ల్యాండ్ అక్విజిషన్ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా ప్రజావాణికి 63 ఫిర్యాదులు

సిటీబ్యూరో, మార్చి 24(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయంటూ ప్రజావాణికి 63 ఫిర్యాదులందాయి. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రజలు తమ ఫిర్యాదులను హైడ్రా అధికారులకు ఇచ్చారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన భూమిని స్థానికంగా పలుకుబడి ఉన్న వ్యక్తులు కబ్జా చేస్తున్నారని, వాటిని కాపాడాలంటూ ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇంజాపూర్‌లో పాఠశాలకు ఆనుకుని ఉన్న 14 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. మియాపూర్–బీహెచ్ఈఎల్ ప్రధాన రహదారిలో ఉన్న గంగారాం చెరువు ఎఫ్‌టీఎల్ ఎగువన తమ ఇంటి స్థలాలున్నప్పటికీ నిర్మాణానికి తమకు పర్మిషన్లు ఇవ్వడం లేదంటూ వెంటనే ఎఫ్‌టీఎల్ నిర్ధారించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు స్థానికులు కోరారు.

## జీహెచ్ఎంసీ పథకాలపై ట్రైనీ ఐఏఎస్‌లకు శిక్షణ

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలో నగరంలో అమలు చేస్తున్న పథకాలు, మౌలిక సదుపాయాలపై శిక్షణలో ఉన్న ఐఏఎస్‌లకు అవగాహన కల్పించారు. తెలంగాణ ఐఏఎస్‌లకు పలు జిల్లాల్లో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్లుగా పనిచేయగా, తాజాగా ఎంసీహెచ్ఆర్డీలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రజలకు అందిస్తున్న సేవలు, సంస్థ ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల గురించి జీహెచ్ఎంసీకి వచ్చిన ట్రైనీ అధికారులకు కూకట్‌పల్లి జోనల్ అధికారి అపూర్వ చౌహాన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

## శ్వాస కోశ క్యాన్సర్ల పై అంతర్జాతీయ సదస్సు

సిటీ బ్యూరో, మార్చి24,(నమస్తే తెలంగాణ): యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ ఆధ్వర్యంలో ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్ అండ్ లంగ్ క్యాన్సర్ల పై సోమవారం అంతర్జాతీయ శిక్షణ సదస్సు, లైవ్ వర్క్ షాప్ నిర్వహించారు. యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. జి. ఎస్. రావు ముఖ్య అతిథిగా విచ్చేసి అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు.

# బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్వీ



ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కి మతిస్థిమితం తప్పిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ అన్నారు. తక్షణమే ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం దశరథ్ మాట్లాడుతూ కేసీఆర్‌పై ఆరోపణలు చేయడం కాదని, దమ్ముంటే అవి నిరూపించాలని సవాల్ చేశారు. గత పదిహేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమేనని, ఎంజాయ్ చేసిన ఆరోపణలపై విచారణ జరిపి ప్రజలకు నిజానిజాలు తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ముక్కు నేలకు రాసి కేసీఆర్ కు క్షమాపణలు చెప్పాలని సూచించారు. బండి సంజయ్‌ను తక్షణమే కేంద్ర మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేసి పార్టీ నుంచి తొలగించాలని ప్రధాని మోడీని కోరారు. బండి సంజయ్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని స్పీకర్ కార్యాలయాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, నాయకులకు శివ, కొంపల్లి నరేష్, శీను నాయక్, కోదాటి నాగేందర్, బల్లెం అవినాష్, సాయి గౌడ్, సంజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

### బండి సంజయ్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

బంజారాహిల్స్, మార్చి 24: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దొంగ నోట్లు ముద్రించి ఎన్నికల్లో పంచాడంటూ కేంద్రం మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేత ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రావణ్ తో పాటు పలువురు నేతలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, కిషోర్ గౌడ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ ఆదివారం బీజేపీ ఆఫీసులో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్‌ను ఉద్దేశించి బీదర్‌లో దొంగ నోట్లు ప్రింటింగ్ చేసే మిషన్ ఉందంటూ చేసిన ఆరోపణలు ప్రజల మధ్య వైషమ్యాలు పెంచేలా ఉన్నాయన్నారు. బండి సంజయ్‌పై వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరారు. తాను కేంద్రమంత్రి అనే విషయం మర్చిపోయి ఎలాంటి అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న బండి సంజయ్ తీరు సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నేతలు మన్నె గోవర్ధన్ రెడ్డి, డా. కుర్వ విజయ్ కుమార్, అశ్విన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఓయూపై నిర్బంధం ఎవరివల్లా కాదు

ప్రొఫెసర్ హరగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజాస్వామ్య గొంతుక ఉస్మానియా యూనివర్సిటీపై నిర్బంధం విధించడం ఎవరివల్ల కాదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. తక్షణమే సర్క్యులర్ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఓయూలో ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాలలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ యూనివర్సిటీలు భావ సంఘర్షణకు నిలయాలుగా ఉండాలని అన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించకుండా నిరోధిస్తూ సర్క్యులర్ జారీ చేసి ఆంక్షలు విధించమంటే సమాజాభివృద్ధిని అడ్డుకోవడమేనని అభిప్రాయపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, రైతులు, కార్మికులు మహిళలలకు అనేక హామీలిచ్చి మోసం చేసిందని మండిపడ్డారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ యూనివర్సిటీ యాజమాన్యం న్యాయబద్ధంగా పోరాడుతున్న విద్యార్థి సంఘాలను వారి కార్యకలాపాలను అడ్డుకోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యూనివర్సిటీ లో ఉన్నటువంటి కళాశాల ప్రిన్సిపాల్స్, వివిధ శాఖల అధిపతులను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గోవర్ధన్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి యూనివర్సిటీలు దిక్సూచిగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఎస్ఎల్ పద్మ, ఎస్యూసీఐ రాష్ట్ర నాయకులు మురహరి, సీఎల్సీ నాయకులు నారాయణరావు, సీపీఐ నాయకులు కాంపల్లి శ్రీనివాస్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పుట్ట లక్ష్మణ్, అర్.ఎల్.మూర్తి, అనిల్, అల్లూరి విజయ్, పొడపంగి నాగరాజు, ఆనంద్ రావు, లెనిన్, నెల్లి సత్య, ఉదయ్, మంద నవీన్, రాకేష్, శ్రీను, ఆసిఫ్, సంతోష్, సాయిరాం, రాజేష్, కంచర్ల బద్రి, అవ్వారి వేణు, అశ్వన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయి

అసెంబ్లీలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి



సిటీబ్యూరో, మార్చి 24,(నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి నియోజవర్గంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ మా ప్రాంతంలో విపరీతంగా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. అల్వాల్‌లోని సర్వే నెంబర్ 482, 483లో యూఎల్‌సీ భూమి ఉన్నది. సర్వే నంబర్ 198, 199లో హిందూ శ్మశాన వాటికలో తాత్కాలిక డంప్‌యార్డ్‌ను ఏర్పాటు చేశారు. దీంట్లో కార్గిల్ యుద్ధ వీరుడు రామచందర్ సమాది ఉంది. ఇక్కడే రాంకీ సంస్థ పెద్దఎత్తున ప్లాస్టిక్ దందాకు తెరలేపింది. సర్వే నం 274 నేరేడ్‌మెట్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. బ్లూషీట్స్ వేసిన స్థలాలన్నీ కబ్జాకు గురవుతున్నాయి. సర్వేనెం 538,539,540,541 లో ఉన్న భూదాన్ భూముల్లో ఇసుక వ్యాపారం నిర్వహిస్తున్నారు. బస్సులు నిలుపుతున్నారు. మాకు క్రీడా మైదానానికి ఇవ్వమంటే కూడా ఒప్పకోలేదు. సర్వేనం 844లో హైదరాబాద్– మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల మధ్యలో ఉన్న భూమిలో సర్వే నిర్వహించాలని కలెక్టర్‌ను చాలా సార్లు బ్రతిమిలాడాను. సొంతభూముల మాదిరి ఇక్కడ ప్రభుత్వ భూములను పలువురు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం తెచ్చిన హైడ్రా మా జిల్లాలో పనిచేయదా? పేదల మీద ప్రతాపం చూపించే హైడ్రా పెద్దోళ్ల మీద కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినా కూడా పనిచేయడంలేదు. 384 ఎకరాలు వక్ఫ్ భూములు 22ఏ కింద రెవెన్యూశాఖ ఆ భూముల్లో ఎలాంటి లావాదేవీలు జరగకుండా నిషేధించింది. కానీ గత 30ఏళ్ల నుంచి ఈ భూమిలో 16569 ఇండ్లు ఆస్తి పన్ను జాబితాలో ఉన్నాయి. నలబై కాలనీలు 1 బై సర్వేనంబర్లమీద ఉన్నాయి. సర్వేనెం 398,399లోని 20 ఎకరాల వక్ఫ్ భూమిలో పోలీసులు ఇతరులను కబ్జా మీదికి తెచ్చారు. కబ్జాకు గురైన వక్ఫ్ భూమిపై నోటీసులు జారీ చేయాలని సీఈవోను వేడుకున్నా పట్టించుకోవడంలేదు. చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆర్టీఐ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.



## ఘనంగా ఉగాది పురస్కారాలు

రవీంద్రభారతి, మార్చి24ః సూర్యచంద్ర సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఉగాది పురస్కారాలు, బెండకాయ షార్ట్ ఫిల్మ్ సాంగ్ రిలీజ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తొలి తెలంగాణ మాజీ అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదన్‌చారి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి పలువురికి ఉగాది పురస్కారాలను అందజేసి, బెండకాయ షార్ట్ ఫిల్మ్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. నారాయణరావు, నటుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆధ్వర్యంలో పార్సిళ్ల వేలం

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ ): టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీతో పార్సిళ్ల వేలం నిర్వహిస్తున్నట్టు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది వినియోగదారులు పార్సిళ్లను తీసుకోకపోవడంతో ఆర్టీసీ వద్దే ఉన్న పార్సిళ్లను వేలం వేస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 27, 28, 29న మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూబ్లీ బస్టేషన్ ప్లాట్‌ఫారమ్ నం.14 వద్ద ఉన్న కార్గో వద్ద వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

## 'ఫార్మాసిటీని రద్దుచేశాం'

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీని రద్దు చేశామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాకు విశేష స్పందన లభిస్తుందని దానికి ప్రజలు జేజేలు కొడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ చేపట్టిన ఫ్యూచర్‌సిటీకి సంబంధించి భూసేకరణను పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ఫార్మా కంపెనీలు విషకూపమని, ఈ నేపథ్యంలోనే ఫార్మాను రద్దు చేసి, ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని, స్కిల్ యూనివర్సిటీని నెలకొల్పుతున్నామని వెల్లడించారు. ఎవరు వద్దన్నా మూసీ సుందరీకరణ, ఫ్యూచర్‌సిటీ, హైడ్రా కొనసాగాల్సిందేనని వాటికోసం ఎన్ని కోట్లయినా ఖర్చు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## భీమా జువెల్లర్స్ ఉగాది ఆఫర్లు

సిటీబ్యూరో: భీమా జ్యువెల్లర్స్ ఉగాది ఆఫర్లను అందిస్తున్నట్టు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంగారు ఆభరణాలు మేకింగ్ ఛార్జీలపై 35 శాతం తగ్గింపు, డైమండ్ జువెల్లరీ20 శాతం తగ్గిపు, వెండిపై కిలో గ్రాముకు 5 వేల తగ్గింపు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భీమా జువెల్లర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ బిందుమాదవ్ మాట్లాడుతూ కస్టమర్లకు నాణ్యమైన సేవలను అందించడం కోసం ఆఫర్లు తీసుకొచ్చామని తెలిపారు. సోమాజిగూడ, ఎఎస్‌రావునగర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో బ్రాంచీలు ఉన్నాయని వివరించారు.

## టీబీ మహమ్మారిని తరిమేద్దాం.. కలెక్టర్



టీబీ డే వేడుకలను జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా క్షయ నివారణ అధికారి చల్ల దేవి

వెంగళరావునగర్, మార్చి 24 అవగాహనతోనే క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించ వచ్చని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎర్రగడ్డలోని స్టేట్ టీబీ సెంటర్ లో హైదరాబాద్ జిల్లా క్షయ నివారణ అధికారి చల్లదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టీబీ మహమ్మారిని దేశం నుంచి తరిమి వేయడానికి భారతదేశం అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వరి, కన్సల్టెంట్ డాక్టర్ స్నేహ శుక్ల ,చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్ కుమార్, టీబీ అలర్ట్ ప్రాజెక్టు డైరెక్టర్ రమేష, ప్లాన్ ఇండియా ఎన్జీవో మహావీర్, పీపీఎం ఎన్జీవో భవ్య, మహమ్మద్ లతీఫ్ పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు మాకొద్దు



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

కవాడిగూడ, మార్చి 24ః పర్యావరణానికి హాని కలిగించే డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారానగర్ డంపింగ్ యార్డును రద్దు చేయాలని పలు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, గుమ్మడిదల మండలం జేఏసీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, ప్రజా సంఘం ఆల పోరాట వేదిక కన్వీనర్ కె.రాజయ్య, పటాన్‌చెరు సీఐటీయూ ఏరియా ఇన్‌చార్జి బి.నాగేశ్వర్‌రావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు, జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, శేఖర్, మల్లేశంగౌడ్ పాటు రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# రైజింగ్ కాదు.. ఫాలింగ్

(మొదటిపేజీ తరువాయి)

మోటార్ల ఖర్చును సైతం మేఘా కంపెనీతోనే పెట్టించాలని డిమాండ్ చేశారు.

### హైడ్రాతోనే రియల్ ఎస్టేట్ ఢమాల్..

హెచ్ఎండీఏ ఆదాయం ఏటా రూ.120–200 కోట్ల వరకు ఉండేదని, కానీ గడచిన ఏడాదిలో రూ.50కోట్ల కంటే తక్కువగా పడిపోయిందని, అది మెయింటనెన్స్‌కే సరిపోతుందని తెలిపారు. మరోవైపు హెచ్ఎండీఏ రూ.23వేల కోట్లతో ప్రాజెక్టులు చేపట్టిందని, అలాంటప్పుడు వాటిని ఏ రకంగా పూర్తి చేస్తారని నిలదీశారు. భూములను అమ్ముకుని తీసుకుందామని చెబుతున్నారని, కానీ హైడ్రా పుణ్యమాని ఆ పరిస్థితి కూడా లేకుండా పోయిందని తెలిపారు. గ్రేటర్‌లో ఏటా 10–15శాతం కరెంటు డిమాండ్ పెరుగుతుందని, ఈ నేపథ్యంలో గతంలో కేసీఆర్ సర్కారు గ్రేటర్ గ్రిడ్‌ను ప్రణాళికను రూపొందించి అమలు చేసేదని తెలిపారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మాత్రం వేసవి కార్యాచరణ రూపొందించలేదని, అమలు చేయడం లేదని, ఫలితంగా 24 గంటలు కరెంటు ఉండడం లేదని వెల్లడించారు. గ్రేటర్ పరిధిలో 72సబ్‌స్టేషన్లు పెట్టాలని గతంలోనే అధికారులు ప్రతిపాదనలు పెట్టారని, కానీ సర్కారు ఆ టెండర్లను ఆపేసి, దక్షిణ డిస్కం పరిధిలోని 200 సబ్‌స్టేషన్లను కలిపి ఒకేసారి పిలిచిందని, గిట్టుబాటు కాలేదని వచ్చిన ఒక్క కంపెనీ కూడా ఇప్పుడు వెనక్కి వెళ్లిపోయిందని తెలిపారు. ఈ లోగా ఎండాకాలం వచ్చిందని, ఫీడర్లపై భారం పెరిగి ఐటీ కారిడర్‌లో కరెంటు పోతుందని తెలిపారు. ఎలివేటెడ్ కారిడర్‌కు శంకుస్థాపనలు చేశారు తప్ప ఇప్పటికీ సర్వేలే కొనసాగుతున్నాయని, నగరంలో 40 శాతం వీధిలైట్లు వెలగడం లేదని, సీసీ కెమెరాల మెయింటనెన్స్ లేకుండా పోయి నిర్వీర్యం అవుతున్నాయని నిలదీశారు. రెసిడెన్షియల్ నివాసాలకు సైతం కమర్షియల్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, పెనాల్టీలు విధిస్తున్నారని నిప్పులు చెరిగారు. కుక్కల నియంత్రణ చేపట్టాలని తెలిపారు. నగరంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో మళ్లీ కాలుష్యం పెరిగిపోయిందని, బాచుపల్లి ప్రాంతంలో ధర్నాలు చేస్తున్నారని, ఎందుకు కాలుష్యం నియంత్రణ లేకుండా పోయిందని, ఇది ప్రభుత్వం వైఫల్యమా? చేతగాని తనమా? అని వివేకానంద్ నిలదీశారు. వార్‌రూమ్‌లను ఏర్పాటు సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను పూర్తి చేయాలని వెల్లడించారు. జీఐఎస్ సర్వే చేశారని, కానీ ఎందుకు చేశారు? అది ఎక్కడికి వచ్చిందో తెలపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు ఎన్నికల హామీకి కట్టుబడి ఉండాలని, రూపాయి ఖర్చు లేకుండా ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.కొంపల్లిలో నేచురల్ వ్యాలీకి హెచ్ఎండీఏ ఎన్వోసీ ఇవ్వాలని, అది అత్యంత అసరమని వివరించారు.

### దివాళా తీస్తే పెట్టుబడులు ఎలా వచ్చాయి..?

హైడ్రాతో ప్రజలు పూర్తిగా ఇబ్బందులు పడుతున్నారని, బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్యను ఈ సందర్భంగా ఉదహరించారు. కార్నింగ్, తదితర కంపెనీలు మన రాష్ట్రం నుంచి వేరే రాష్ట్రానికి పోవడానికి కారణాలు ఏమిటీ? ఫార్మా సిటీ రద్దు వల్లనా? ఎందుకని నిలదీశారు. ఒకవైపు ప్రభుత్వం 2లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని ప్రచారం చేస్తున్నదని, మరోవైపు రాష్ట్రం దివాళా తీసిందని, ఎవరు నమ్ముతలేరు? అప్పు పుడుత లేదు? అని ముఖ్యమంత్రి ప్రచారం చేస్తున్నారని, అందులో ఏది నిజమని నిలదీశారు.ఈ ఏడాది ఐటీ ఎగుమతులు, కల్పించిన కొత్త ఉద్యోగాలు గతంలో పోల్చితే భారీగా తగ్గాయని, ఎందుకు తగ్గాయని కారణమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను రైజ్ చేయడం సంగతి అటుంచి, పడుకోబెట్టకుండా చూడాలని విమర్శించారు. ఫోర్త్ ఎస్టేట్‌పైనే దృష్టి పెట్టకుండా, హైదరాబాద్ నగరాభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

# అందాల పోటీలు కాదు.. అమ్మాయిలకు రక్షణ కల్పించండి

(మొదటిపేజీ తరువాయి)

సురక్షితంగా ప్రయాణించవచ్చనే ఆలోచన మహిళల్లో ఉంటుందని, కానీ ఇటీవల బస్సులో డ్రైవర్లు ప్రయాణికులపై దాడి చేయడం, ప్రస్తుతం రైల్లో కూడా అత్యాచారయత్న సంఘటనలు చోటు చేసుకోవడం చూస్తుంటే, రాష్ట్రంలో మహిళల భద్రతపై భయం వేస్తుందని ఆవేదన చెందారు. మహిళల కోసం కేటాయించిన రైలు భోగీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తాము రైల్వే పోలీసులను కోరుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించి, బాధితురాలికి న్యాయం చేయాలని ఆమె తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..తల్లిదండ్రులు తమ పిల్లల బయటకు వెళ్లి క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని కోరుకుంటారని, ప్రస్తుతం క్షణ క్షణం తల్లిదండ్రులు భయపడుతున్నారని వాపోయారు. అందాల పోటీలు నిర్వహించడానికి రూ. 200 కోట్లు ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని మహిళల భద్రతకు ఖర్చు పెట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ బాధితురాలి దవడ, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయని, ఆమెకు సూపర్ స్పెషాలిటీ వైద్య చికిత్సలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### విచారణ వేగవంతం చేశాం.. రైల్వే ఎస్పీ చందనాదీప్తి

నిందితుడిని పట్టుకునేందుకు విచారణ వేగవంతం చేశాం. వీలైనంత త్వరగా నిందితుడిని పట్టుకుంటాం. రైలులో ప్రయాణించే మహిళలు తమ స్మార్ట్ ఫోన్‌లో షీటీం సూచించిన పలు యాప్‌లు డౌన్లోడ్ చేసిపెట్టుకోవాలి. ఏదైనా ప్రమాదం ఉందని గుర్తిస్తే.. దానిలో సమాచారం అందిస్తే వెంటనే ఆర్పీఎఫ్ పోలీసులు 10 నిమిషాల్లో అక్కడికి చేరుకుంటారు' రైల్వే ఎస్పీ చందనాదీప్తి తెలిపారు.

### నిలకడగా ఉంది: డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ కుమార్

బాధితురాలిని శనివారం రాత్రి అత్యవసర విభాగానికి తరలించగానే చికిత్స ప్రారంభించాం. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. డెంటల్, న్యూరో, గైనకాలజీ వైద్యులు ఆమెను పరీక్షిస్తున్నారు' అని గాంధీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు సోమవారం సాయంత్రం గాంధీ ఆసుపత్రి నుంచి యశోద హాస్పిటల్‌కు తరలించి, చికిత్సనందిస్తున్నారు.

## నాగార్జున సాగర్, శ్రీశైలం కుడి కాల్వ వద్ద ప్రైవేట్ ప్లాంట్లు

- జలదోపిడీని అరికట్టడంలో పాలకులు విఫలం
- బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి
- సామాజికవేత్త కోటగిరి అశోక్ కుమార్



మాట్లాడుతున్న అశోక్ కుమార్

ఖైరతాబాద్, మార్చి 24: నాగార్జున సాగర్, శ్రీశైలం కుడి కాలువ వద్ద ప్రైవేట్ హైడల్ ప్లాంట్లు నెలకొల్పి జలదోపిడీకి పాల్పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని సామాజికవేత్త కోటగిరి అశోక్ కుమార్ ఆరోపించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాలకుల తీరును తప్పుపట్టారు. నాగార్జున రైట్ బ్యాంక్ కెనాల్18, శ్రీశైలం రైట్ బ్యాంక్ వద్ద 16 ప్రైవేట్ హైడల్ ప్లాంట్స్ ఉన్నాయని, రైసు మిల్లుల మాదిరిగా వాటిని కట్టేశారన్నారు. గత 20 ఏండ్లుగా వాటి ప్రయోజనం కోసం నిరంతరం నీటిని వదులుతున్నారని, వాటిని వెనక్కి తీసుకువచ్చే పరిస్థితి ఉండదన్నారు. ఆ రెండు ప్లాంట్స్ కలిపి కనీసం 50 మెగావాట్ల విద్యుత్ కూడా ఉత్పత్తి చేసే అవకాశం లేదన్నారు. ఏ ఒప్పందం ప్రకారం నాగార్జున, శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాళ్ల పరిధిలో ప్రైవేట్ హైడల్ ప్లాంట్స్ ఇచ్చారో పాలకులు సమాధానం చెప్పాలన్నారు. ప్రతి చోట నీటి దోపిడీ జరుగుతూనే ఉందని, ప్రైవేట్ ప్లాంట్స్, వాటికి అనుమతులు ఇచ్చిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు.

# దిగజారిన రక్షణ.. చేజారిన భద్రత

(మొదటిపేజీ తరువాయి)

ఘటన హైదరాబాద్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. బాలీవుడ్‌లో సినిమాలతో పాటు టీవీ సీరియల్స్‌లో నటిస్తున్న ఓ నటిని ఈనెల 17న హైదరాబాద్‌లోని ఆమె స్నేహితురాలు షాప్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించింది. కార్యక్రమంలో పాల్గొన్నందుకు ప్రయాణ ఖర్చులు, పారితోషికం చెల్లిస్తారని చెప్పింది. ఆమె మాటలు నమ్మి ఈనెల 18న హైదరాబాద్‌కు వచ్చిన యువతిని మాసబ్ ట్యాంక్ శ్యామ్‌నగర్‌కాలనీలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో బస ఏర్పాటు చేశారు. ఆ ఇంట్లో ఉన్న వృద్ధురాలు నటికి అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చారు. అయితే 21న రాత్రి 9 గంటలకు ఇద్దరు మహిళలు నటి ఉన్న అపార్ట్‌మెంట్‌కు వెళ్లి ఆమెను వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేశారు. అదేరోజు రాత్రి 11 గంటలకు ముగ్గురు పురుషులు ఆ నటి ఉన్న గదిలోకి ప్రవేశించి తమతో గడపాలని ఒత్తిడి చేశారు.ఆమె ఒప్పుకోకపోవడంతో ఆమెపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఆమె గట్టిగా అరిచి పోలీసులకు చెబుతానని బెదిరించడంతో వారు పారిపోయారు. ఆ తర్వాత వృద్ధురాలితో పాటు ఇద్దరు మహిళలు వచ్చి ఆమెను కొట్టి తన వద్ద ఉన్న 50వేల రూపాయల నగదు తీసుకొని గదిలో బంధించి వెళ్లిపోయారు. బాధితురాలు 100కు డయల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన మాసబ్ ట్యాంక్ పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. అయితే ముంబైకి చెందిన సహ నటి విషయంలో జరిగిన ఈ ఘటనతో హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతినే అవకాశమున్నందున పోలీసు బాస్‌ల నుంచి స్థానిక పోలీసులకు పెద్ద ఎత్తున చీవాట్లు పడ్డాయి. ఈ కేసును సీరియస్‌గా తీసుకోవాలంటూ పోలీస్ బాస్ సూచించినట్లు సమాచారం.

### అది తప్పుడు ఫిర్యాదు

అయితే బాలీవుడ్ సహ నటి కేసులో ఇది తప్పుడు ఫిర్యాదు అంటూ మసబ్ ట్యాంక్ పోలీసులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫిర్యాదుపై తాము దర్యాప్తు చేస్తున్నప్పుడు ఇది తప్పుడు ఫిర్యాదుగా తేలిందని సీఐ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మహిళ ఈనెల 18న బాలీవుడ్ సహ నటితో పాటు మరో ఇద్దరు యువతులను నగరానికి పిలిపించినట్లు తెలిపారు. తన తల్లి సహకారంతో వ్యభిచార గృహం నడుపుతున్న నరేశ్ అనే వ్యక్తి ఇంటికి ఆ ముగ్గురిని తీసుకెళ్లారని చెప్పారు. ఆ తర్వాత శనివారం హైదరాబాద్‌కు చెందిన మహిళతో పాటు ముగ్గురు యువతులకు మధ్య డబ్బుల చెల్లింపులకు సంబంధించి గొడవ జరిగిందని, దీంతో బాలీవుడ్ సహ నటి వారిపై ఫిర్యాదు చేసి సొంతూరికి వెళ్లిపోయినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం పోలీసులు హైదరాబాద్‌కు చెందిన మహిళతో పాటు నరేశ్, బాలీవుడ్ సహ నటి, మరో ఇద్దరు యువతుల గురించి గాలిస్తున్నామని, మరో టీమ్‌ను పంకజ్ అనే ముంబై బ్రోకర్‌ను వెతకడానికి పంపించామని పేర్కొన్నారు.